# ప్రజల మాట ప్రగతి బాట

## 3 గంటల విద్యుత్ సరిపోదు..



రైతులకు మూడు గంటల విద్యుత్ దేనికీ సరిపోదు. ఏ అవగాహనతో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంటుతో రైతులు నిబ్బరంగా పొలాలకు నీరు పారించుకుంటున్నారు. రాత్రుళ్లు పొలాల వద్ద నిద్రించే బాధ తప్పింది. కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంటు కష్టాలే. విద్యుత్ ప్రమాదాలు మళ్లీ జరుగుతాయి. ఏ రైతుకు కూడా 10హెచ్‌పీ మోటర్ అవసరంలేదు. ఈ ప్రాంతంలో ప్రతి రైతు మూడు నుంచి ఐదు హెచ్‌పీ మోటర్లే వాడుతున్నారు.

**–దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రైతు, రేజర్ల, సత్తుపల్లి మండలం**

## సాగుపై కాంగ్రెసోళ్లకు అవగాహన లేదు.



రైతులకు మూడు గంటల కరెంటు చాలని, 10హెచ్‌పీ మోటర్లు వినియోగించాలని కాంగ్రెసోళ్లు చెప్పడం విడ్డూరంగా ఉంది. మా ప్రాంతంలో 10 హెచ్‌పీ మోటర్లు ఎవరూ వాడరు. మాకు 5 హెచ్‌పీ మోటర్లే సరిపోతాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఎందుకు 10హెచ్‌పీ మోటర్లు వినియోగిస్తారు. 10హెచ్‌పీ మోటర్ల కొనుగోలు కూడా అధిక ధరలు చెల్లించాల్సి వస్తుంది. కాంగ్రెస్ నాయకుల మాటలు చూస్తుంటే వారికి వ్యవసాయంపై అవగాహన లేదనిపిస్తుంది.

**– చింతల బాలకృష్ణారెడ్డి, రైతు, రేజర్ల, సత్తుపల్లి మండలం**

## ధరణి చాలా బాగుంది..



గతంలో భూములు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే మధ్యవర్తులను ఆశ్రయించాల్సి వచ్చేది. దళారులతో ఖర్చు భరించి పనిచేయించుకోవాల్సి వచ్చేది. తెలంగాణ ప్రభుత్వం ధరణి తీసుకురావడంతో తిప్పలు తప్పాయి. భూమి కొనుగోలు చేసిన వెంటనే అధికారులు రిజిస్ట్రేషన్ పూర్తిచేసి పాస్‌బుక్‌లో ఎక్కిస్తున్నారు. ధరణి వల్ల అన్ని విధాలుగా కచ్చితంగా ఉన్న భూములు అమ్మడం, కొనడంలో ఎలాంటి ఇబ్బందులు లేవు. భూ రిజిస్ట్రేషన్ కోసం కేసీఆర్ తీసుకువచ్చిన ధరణి వ్యవస్థ చాలా బాగున్నది. కొత్త పాస్‌బుక్‌లో భూమి వివరాలు నమోదు కావడంతో వెంటనే రైతుబంధు కూడా చేతికొస్తుంది.

**–కొండపల్లి రమేశ్‌రెడ్డి, రైతు, సత్తుపల్లి**

## ధరణిని తీసేసి భూములు లాక్కుంటరేమో..



ప్రస్తుతం ధరణి పోర్టల్ ఉండడం వల్లనే భూములు, వాటి రికార్డులు భద్రంగా ఉంటున్నాయి. పటిష్టమైన భద్రత కవచాలు ఉన్న ధరణి తీసేసేందుకు కాంగ్రెస్ నేతలు కుట్రలు పన్నుతున్నారు. దానిని తీసేసి ఎంచక్కా వారి నైజం ప్రకారం పాత పద్ధతులు తెస్తారు. దీంతో రైతులకు తెలియకుండానే వారి భూములను మాయం చేస్తారు. ఇష్టానుసారంగా రికార్డులు మార్చేస్తారు. వ్యవసాయ భూముల్లో చిక్కు ముడులు లేకుండా ఉండేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారు. ఎవరి భూములు వారికి, ఎవరి రికార్డులు వారికి స్పష్టంగా ఉన్నాయి. అడ్డగోలుగా భూముల రికార్డులు మార్చడం, రైతుకు తెలియకుండానే క్రయవిక్రయాలు జరగడం వంటివి ధరణిలో జరగవు. రైతు వేలి ముద్ర లేకుండా అతడి భూమిని తాకను కూడా తాకలేదు. ఈ విధానమే కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడడం లేదు. గతంలో భూముల విషయంలో అనేక అవకతవకలు, గొడవలు, కోర్టు కేసుల వంటివి అనేకం చూశాం. కానీ నేడు ధరణి వచ్చాక అలాంటి తగాదాలు అవకాశం లేకుండా పోయింది. ఎన్నికల్లో లబ్ధి కోసమే ధరణిని ఎత్తివేస్తామంటూ రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్క ప్రచారం చేస్తున్నారు. ధరణి పోర్టల్ నూటికి నూరు శాతం ఉండాలి.

**–చెక్కిలాల లక్ష్మణరావు, రైతు, గౌరవరం, పెనుబల్లి**

## ధరణితో కర్షకులకు ధైర్యం.. కాంగ్రెస్ నేతలకు భయం..



ధరణి పోర్టల్ అంటేనే కాంగ్రెస్ నేతలు శివాలెత్తుతున్నారు. దాని పేరు వింటేనే గడగడలాడుతున్నారు. అందుకే నోటికొచ్చిన మాటలు మాట్లాడుతున్నారు. ధరణి పోర్టల్ వల్ల కర్షకులు ఇంత ధైర్యంగా ఉంటుంటే.. కాంగ్రెస్ నేతలు ఎందుకో భయపడుతున్నారు. ధరణి వద్దేవద్దంటున్న వారి మాటలు ఎందుకో పెద్ద అనుమానమే కలిగిస్తున్నాయి..నిజానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణి వల్లనే మాలాంటి రైతుల భూములన్నీ భద్రంగా ఉన్నాయి. పైగా వాటి విలువ కూడా పెరిగింది. ఇంతకుమునుపు ఎవరైనా భూములు కొనాలంటే ఎంతో ఇబ్బందులు పడేవాళ్లు. ఆ భూములకు సంబంధించి సరైన పత్రాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు సమస్తం ధరణిలో ఉంటున్నాయి. అమ్మే వారు, కొనే వారు వేలి ముద్ర పెడితే క్షణాల్లోనే భూముల బదలాయింపు జరుగుతుంది. దళారులకు తావే లేవు. కానీ కాంగ్రెస్ నేతల ప్రకారం పాత పద్ధతులు దళారులు, లంచాలతోనే రైతులు దగా పడతారు. అప్పట్లో రైతులు తమ భూములను తాము సాగు చేసుకుంటున్నప్పటికీ రికార్డులు తమ ఇంకా ఉందోలేదోననే ఆందోళన పడేవారు. ఇప్పుడిప్పుడే ధరణితో ధైర్యంగా ఉంటున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలన వచ్చినా, వారు చెబుతున్నట్లుగా ధరణిని నిలిపివేసినా మొదటగా మోసపోయేది రైతులే. అందుకే కాంగ్రెస్ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మొద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ ధరణి ఉండి తీరాల్సిందే.


**–వర్దెబోయిన నాగేశ్వరరావు, కుప్పెనగుంట, రైతు, పెనుబల్లి**

## 3 గంటలు పనికిరాని మాట



కాంగ్రెసోళ్లు అన్నట్లు వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ ఇవ్వడమనేది పనికిరాని మాట. మూడు గంటల విద్యుత్ ఇస్తే మోటర్ల కెపాసిటీని పెంచాలి. అలా పెంచితే రైతులు పండించిన పంట మొత్తం మోటర్లు మార్చడానికి ఖర్చు చేయాల్సి వస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తున్న 24 గంటల విద్యుత్ సరఫరానే కరెక్ట్. రైతులు ఉన్న మోటర్లతోనే నిరంతర కరెంటుతో పంటలకు నీళ్లు పారించుకుంటున్నరు. ఇప్పుడిచ్చే కరెంటు అన్ని వర్గాలకు బాగానే ఉంది.

**–షేక్ ఖాజావలీ,**
**ఎలక్ట్రీషియన్,**
**మోటర్ వైండింగ్**



## ధరణి లేకుంటే రైతుల వడ్లు ఎలా కొంటారు



ధరణి పోర్టల్ లేకపోతే రైతులు పండించిన ధాన్యం ఏ విధంగా కొనుగోలు చేస్తారు. ధరణి ఉన్నందు వల్ల రైతుల వివరాలన్నీ తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయంలో ఉండడం వల్ల పండించిన ప్రతి గింజను కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. ధాన్యానికి సంబంధించి డబ్బులను రైతుల అకౌంట్లలో జమచేయడంతో పాటు రైతుబంధు కూడా అందిస్తున్నారు. ధరణి లేకుంటే అన్నదాతలకు పెట్టుబడి సాయం, వడ్ల డబ్బులు ఎలా వేస్తారో అర్థం కావడంలేదు. ధరణి తీసేస్తే మళ్లీ పాతరోజులే వస్తాయి. కాంగ్రెస్ నాయకులకు రైతులు, వ్యవసాయంపై అవగాహన లేక ధరణి తీసేస్తామంటున్నారు.

**–మోటపోతుల వెంకటేశ్వరరావు, రైతు, రామానగరం, సత్తుపల్లి మండలం**

## మూడు గంటలైతే మునుగుడే



కాంగ్రెస్ గెలిస్తే మూడు గంటల కరెంటు ఇస్తామంటుర్రు. మూడు గంటల కరెంటు ఇస్తే రైతులు ఇక మునుగుడే తప్ప మరో మార్గంలేదు. మళ్లీ పాత రోజులు రాక తప్పదు. రాత్రనక పగలనక తేడా లేకుండా బావులు, బోర్ల వద్దకు పోక తప్పదు. నిద్రాహారాలు మానక తప్పదు. రైతులు మృత్యువాత పడడం ఖాయం. కరెంటు కష్టాలు వద్దనుకుంటే కారు గుర్తుకు ఓటు వేయాలి. రైతులందరూ బాగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటే రైతు రాజ్యం మళ్లీ వస్తుంది. లేదంటే రాక్షసుల రాజ్యం వస్తుంది.

**–వాలూరి దామోదర్, రైతు, తాళ్లచెరువు, తిరుమలాయపాలెం మండలం**

## 10హెచ్‌పీ మోటర్లు ఎలా సాధ్యం?



చిన్న, సన్నకారు రైతులు 10హెచ్‌పీ మోటర్లు ఏర్పాటు చేసుకోవడం ఎలా సాధ్యమవుతుంది. 10హెచ్‌పీ మోటర్లు అయితే మూడు గంటల కరెంటు సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి ఒకటి రెండు ఎకరాల రైతులు 10హెచ్‌పీ మోటర్లు ఎలా పెట్టుకుంటారు. కాంగ్రెస్ గౌర్నమెంటు వస్తే సన్న, చిన్నకారు రైతులకు ఇబ్బందులు తప్పవు. బీఆర్ఎస్ పాలనలో 24 గంటల కరెంటు వస్తుంటే హాయిగా ఎప్పుడంటే అప్పుడు మోటరు పెట్టుకొని పొలం తడుపుకొంటున్నాం. కాంగ్రెస్ గెలిస్తే మనలాంటి చిన్న రైతులకు కష్టాలు తప్పవు. సన్న, చిన్నకారు రైతులు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలి.

**–గడిపుడి రాజా, రైతు, తాళ్లచెరువు, తిరుమలాయపాలెం మండలం**

## ధరణితోనే రైతుకు భరోసా



ధరణి పోర్టల్‌తోనే రైతు భూములకు భరోసా వచ్చిందన్నారు. ప్రతి భూమిని ఆన్‌లైన్‌లో చూసుకునే పరిస్థితి రావడంతో రెవెన్యూ వ్యవస్థలో ఉన్న లోపాలు లేకుండా చేసినట్లైంది. ఒకరి భూమిని మరొకరికి బదలాయించే పరిస్థితి లేకుండా ఉంది. ధరణితోనే తెలంగాణ రైతులకు మంచి రోజులు వచ్చాయి. సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ స్వాగతించాలి.

**–బద్దం కోటిరెడ్డి, రెడ్డిగూడెం, తల్లాడ మండలం**

## కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలు



కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కరెంట్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి కరెంట్‌తో పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. 24 గంటలు విద్యుత్‌తో పగలే పంట పొలాలకు నీళ్లు పెట్టుకొని రైతులు సంతోషంగా ఉన్నారు. మూడు గంటలు కరెంట్ ఇస్తామని నాయకుల మాటలు చెబితే పొలాలకు నీళ్లు సరిపోక పంటలు ఎండిపోతాయి. కరెంట్ కష్టాలు మొదలై రైతు ఆగమయ్యే ప్రమాదం ఉంది.

**–వడ్డే కృష్ణయ్య, రైతు , కలకొడిమ, తల్లాడ మండలం**

## మూడు గంటలు కరెంట్‌తో రైతు ఆగమవుతాడు



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంట్‌తో రైతులు ఆగమయ్యే పరిస్థితి వస్తుంది. సీఎం కేసీఆర్ 24 గంటలు ఇస్తుంటేనే తెలంగాణ రాష్ట్రం ధాన్యరాసులతో తులతూగుతున్నది. అటువంటి తెలంగాణలో కాంగ్రెస్ అడుగు పెడితే తెలంగాణ రాష్ట్రం కరువు తాండవించే పరిస్థితులు నెలకొంటాయి. రైతులు ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేయాలి.

**–చలిగంజి తిరుమల, తల్లాడ**

## భూస్వాముల మేలు కోసమే..



భూస్వాములకు మేలు చేసేందుకే కాంగ్రెస్ ధరణి రద్దు చేస్తామంటున్నది. కేసీఆర్ ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండ తెల్లకాగితాల మీద రాసుకున్న భూములకు మధ్యవర్తులను తొలగించి ఉచితంగా పట్టాలు ఇచ్చింది. మా భూములను ధరణిలో పెట్టింది. ధరణి పోర్టల్‌తో చిన్న, సన్నకారు రైతుల భూములకు రక్షణ ఏర్పడింది. ధరణి వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయి. అలాంటి ధరణిని రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్‌ను ఓటు ద్వారా బంగాళాఖాతంలో కలపాల్సిందే.

**–గోకినపల్లి సహదేవ్, రైతు, పిండిప్రోలు, తిరుమలాయపాలెం మండలం**